క్లుప్తంగా

చెక్కుల అందజేత



మహబూబాబాద్ రూరల్: హోం గార్డ్ ఆఫీసర్లుగా విధులు నిర్వహిస్తున్న బి.మహేష్, ఎల్.కుమారస్వామికి హోమ్ గార్డ్ వెల్ఫేర్ ఫండ్ కింద మంజూరైన రూ.10వేల చెక్కులను ఎస్పీ శరత్ చంద్ర పవార్ శనివారం అందజేశారు.

తహసీల్దార్‌గా బాధ్యతలు

దంతాలపల్లి: మండల నూతన తహసీల్దార్‌గా తేళ్ల శ్రీనివాస్‌రావు శనివారం బాధ్యలు స్వీకరించారు. ఆయన ఖమ్మం జిల్లా సత్తుపల్లి తహసీల్దార్‌గా విధులు నిర్వహించి బదిలీపై ఇక్కడకు వచ్చారు. అలాగే డిప్యూటీ తహసీల్దార్‌గా ఉప్పల నర్సయ్య బాధ్యతలు స్వీకరించారు.

డీటీగా శివాణి

కొత్తగూడ: కొత్తగూడ డిప్యూటీ తహసీల్దార్‌గా శివాణి శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన నర్సయ్య దంతాలపల్లి డీటీగా బదిలీ కావడంతో ఆయన స్థానంలో శివాణి బాధ్యతలు తీసుకున్నారు.

విద్యార్థులతో చెలగాటం

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో ప్రైవేట్ కళాశాలలు విద్యార్థుల దగ్గర హాల్‌టికెట్ నంబర్లు తీసుకొని, వారికి సంబంధం లేకుండా ఓటీపీ చెప్పమని అడ్మిషన్లను చేసుకుంటూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. అడ్మిషన్ల సమయంలో విద్యార్థుల దగ్గరికి వెళ్లి వారిని ఇబ్బందులు పెడుతున్న ప్రైవేట్ కళాశాలలపై చర్య తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు చరణ్, దిలీప్, రఘు, అరవింద్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలి



మహబూబాబాద్: కేసముద్రం మండలం అన్నారం గ్రామానికి చెందిన వీఆర్‌ఏ పోస్ట్ విషయంలో అన్యాయం చేశారని బాధితురాలు జి.అనిత శనివారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. తన తండ్రి ముత్తయ్య గ్రామంలో 36 ఏళ్ల వీఆర్‌ఏగా పని చేసి మృతి చెందాడన్నారు. కాగా తన తండ్రి ఇంటి పేరుతో ఉన్న చిన్న వెంకటయ్య అనే వ్యక్తి తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఎలాంటి ప్రొసీడింగ్‌లు లేకుండా అధికారులను మేనేజ్ చేసి వీఆర్‌ఏగా కొంత కాలం పని చేశాడన్నారు. తన తండ్రి వీఆర్‌ఏ పోస్ట్ విషయంలో కోర్టు కేసులో ఉందని, ఆ పోస్ట్ నియామకంను నిలిపివేయాలన్నారు. వీఆర్‌ఏ సర్దుబాటులో వెంకటయ్య దొంతరబోయిన నరేందర్ పేరును సూచిస్తున్నాడని, అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

‘బీసీ బంధు’ పేరిట మోసం

తొర్రూరు: బీసీ బంధు సాయం పేరిట ప్రభుత్వం బీసీలను మోసగిస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రామ్మోహన్‌రెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలో శనివారం బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రూరల్ మండల అధ్యక్షుడు బి.సురేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 2శాతం మందికి కూడా రూ.లక్ష సాయం అందలేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ మోసాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్‌కుమార్, సురేష్, బషీర్, శివలు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

మహబూబాబాద్: ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయని, బాధిత రైతులను ఆదుకోవాలని టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కె.రాంచందర్‌రావు ఆధ్వర్యంలో నాయకులు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సునీత, వెంకటేష్, ప్రేమ్ చంద్‌వ్యాస్, శ్రీనివాస్, ఎల్లయ్య, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

‘గిరిజన బంధు’ ప్రవేశపెట్టాలి

కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కోసం వెంటనే గిరిజన బంధు పథకాన్ని ప్రవేశపెట్టాలని మైదాన ప్రాంత గిరిజన సంఘం రాష్ట్ర కన్వీనర్ తుకారంనాయక్ డిమాండ్ చేశారు. శనివారం సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం మండల కమిటీ కన్వీనర్‌గా దారావత్ రమేష్, కోకన్వీనర్లుగా దారావత్ వీరన్న, బానోతు రాజు, కృష్ణలను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జాటోతు బిచ్చానాయక్, డి జిల్లాల కన్వీనర్ అరుణ్‌నాయక్, శ్రీను, నరేష్, బిచ్చు, వీరన్న, భద్రు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేతోనే అభివృద్ధి

మరిపెడ రూరల్: ఎమ్మెల్యే రెడ్యానాయక్‌తోనే దళిత కాలనీలో అభివృద్ధి జరుగుతుందని సర్పంచ్ బొలగాని మన్మధ అన్నారు. మండలంలోని తాళ్లఊకల్ దళిత కాలనీలో రూ.30 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బొలగాని శ్రీను, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆకుల కిష్టయ్య, ఉప సర్పంచ్ కారింగల సౌజన్యరవి, వార్డు సభ్యులు కిష్టయ్య, లింగయ్య పాల్గొన్నారు.

తల్లిపాలలో రోగ నిరోధక శక్తి అధికం

పెద్దవంగర: తల్లిపాలలో రోగ నిరోధక శక్తి అధికంగా ఉంటుందని, బిడ్డ పుట్టగానే అరగంటలోగా తల్లిపాలు పట్టించాలని ఐసీడీఎస్ సీడీపీఓ హైమావతి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని చిట్యాల గ్రామం అంగన్‌వాడీ కేంద్రాల్లోని బాలింతలకు, గర్భిణులకు ముర్రుపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఎంపీపీ ఈదురు రాజేశ్వరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మహిళలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

శిశువుకు తల్లిపాలే అమృతం

చిన్నగూడూరు: నవజాత శిశువుకు తల్లిపాలే అమృతమని సూపర్‌వైజర్ కవిత అన్నారు. మండలంలోని ఉగ్గంపల్లి, గుండంరాజుపల్లి గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యత గురించి కవిత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మ, జ్యోతి, సంధ్యారాణి, సుమలత, ఏఎన్‌ఎంలు స్వరూప, అనిత, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

బయ్యారం: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం అని అంగన్‌వాడీ టీచర్ విజయలలిత అన్నారు. మండలంలోని జగ్గుతండాలో శనివారం అంగన్‌వాడీ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఉపేంద్ర, లలిత, పద్మ, కమల, ముకుంద, ఆశ, స్వప్న, లక్ష్మి పాల్గొన్నారు.



పెద్దవంగర: మాట్లాడుతున్న సీడీపీఓ హైమావతి

కొత్తగూడ: పిల్లలకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరం అని సీడీపీఓ నీలోఫర్ అజ్మి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సందర్శించారు. ఆమె వెంట సూపర్‌వైజర్ రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

తల్లి ముర్రుపాలే బిడ్డకు శ్రీరామరక్ష

నెల్లికుదురు: పుట్టగానే బిడ్డకు తల్లి ముర్రుపాలే శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి అన్నారు. మండలంలోని నర్సింహులగూడెంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో హిమబిందు, ఊర్మిళ, అయాలు పాల్గొన్నారు.



చిన్నగూడూరు: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ కవిత



నెల్లికుదురు: నర్సింహులగూడెంలో..

బిల్లు ఆమోదించాలని నిరసన

నెహ్రూసెంటర్: ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన బిల్లును గవర్నర్ ఆమోదించి అసెంబ్లీకి పంపించాలని ఆర్టీసీ ఉద్యోగులు శనివారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వంలో విలీనం ద్వారా మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు పి.నాగయ్య, బీఆర్.రెడ్డి, బి.రమేష్, రమాదేవి, కొమురయ్య, సకీనా, ఉషారాణి, నర్సయ్య, రమేష్‌బాబు, సూర్య తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లును గవర్నర్ ఆమోదించకపోవడాన్ని నిరసిస్తూ శనివారం డివిజన్ కేంద్రంలోని డిపో ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటలకు నిరసన తెలిపారు. కార్మికుల ఆందోళనకు జెడ్పీఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్ మద్దతు పలికారు. 43వేల మంది కార్మిక కుటుంబాలకు సంబంధించిన బిల్లుపై గవర్నర్ రాజకీయ కోణంలో ఆలోచించి ఆలస్యం చేయడం దారుణమని, దీనివల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతారని ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు.



నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

బకాయిలను వెంటనే చెల్లించాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లా పరిషత్ ఉద్యోగ ఉపాధ్యాయుల సాధారణ భవిష్య నిధి జీపీఎఫ్‌కి సంబంధించిన అన్నిరకాల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిచింతల విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో మధ్యాహ్న సమయంలో నిరసన తెలిపారు. అనంతరం విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ..పెండింగ్‌లో ఉన్న రుణాలు, పార్ట్ ఫైనల్స్ చివరి రుసుము వెంటనే విడుదల చేయాలన్నారు. జెడ్పీ జీపీఎఫ్‌కు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.2741.82 కోట్ల వడ్డీ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పూర్వ కార్యదర్శి మైస శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిలర్లు గోవర్ధన్, సదానందం, జిల్లా కార్యదర్శులు ఉప్పలయ్య, విష్ణువర్ధన్, మండల అధ్యక్షులు ఉపేందర్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

మహబూబాబాద్: సెకండ్ ఏఎన్‌ఎంలను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేసి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా అజయ్‌సారథి రెడ్డి మాట్లాడుతూ.. పీహెచ్‌సీలలో 15 ఏళ్లుగా సెకండ్ ఏఎన్‌ఎంలు పని చేస్తున్న వారి సేవలను గుర్తించి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రేషపల్లి నవీన్, అశ్విని, నాసియా బేగం, పార్వతి, విజయ, తులసి, సరిత పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

నూతన బస్ సర్వీస్ ప్రారంభం

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ డిపో నుంచి గార్ల, అమ్మపాలెం, డోర్నకల్ మీదుగా ఖమ్మంకు నూతన బస్ సర్వీసు ప్రారంభిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం జలగం విజయ్ శనివారం తెలిపారు. ఈనెల 7వ తేదీ నుంచి ప్రయాణికులకు బస్ సర్వీస్ సేవలు ప్రారంభమవుతాయన్నారు. మానుకోట డిపో నుంచి ఉదయం 6.30, 10.45, మధ్యాహ్నం 3.15 గంటలకు బయల్దేరుతుందన్నారు. గార్ల నుంచి ఖమ్మంకు ఉదయం 7.10, మధ్యాహ్నం 11.25, సాయంత్రం 4.30 గంటలకు చేరుతుందన్నారు. గార్ల నుంచి మహబూబాబాద్‌కు ఉదయం 9.40, మధ్యాహ్నం 2.00, సాయంత్రం 6.30 గంటలకు ఉంటుందన్నారు. ఖమ్మం నుంచి గార్ల, బయ్యారానికి ఉదయం 8.45, మధ్యాహ్నం 1.30, సాయంత్రం 6గంటలకు బస్ ప్రయాణికులకు అందుబాటులో ఉంటుందన్నారు. అదేవిధంగా విద్యార్థుల సౌకర్యార్థం రామగుండాల నుంచి ఇల్లందు వరకు, డోర్నకల్ మండలం వెన్నారం నుంచి ఖమ్మంకు బస్ సర్వీసులను పునరుద్ధరిస్తున్నట్లు డిపో మేనేజర్ విజయ్ తెలిపారు.

ఫైలేరియా కిట్ల పంపిణీ

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని అర్బన్ పీహెచ్‌సీలో శనివారం ఫైలేరియా కిట్లను బాధితులకు అందజేశారు. ఈసందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి రూప మాట్లాడుతూ.. ఫైలేరియా బాధితులకు కిట్లను ఉపయోగించుకుని, ఇతరులకు ఫైలేరియా వ్యాప్తి జరగకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ సెంటర్ వైద్యులు రమ్య, నర్మద, దీపిక, నితిన్, పీహెచ్‌ఎన్ వసంతరాణి, ఆరోగ్య విస్తరణ అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

తొర్రూరు: ఫైలేరియాను సమాజం నుంచి పారదోలాలని జెడ్పీఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం బోధకాలు బాధితులకు బకెట్లు, ఇతర సామగ్రి పంపిణీ చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. బోధకాలు వ్యాధి నిర్మూలనకు మాత్రలు ప్రతి ఒక్కరికి అందేలా ఆరోగ్య సిబ్బంది చొరవచూపాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మురళీధర్, సర్పంచ్ సురేష్, వైద్యులు జ్వలిత, మానస, ఆరోగ్య సిబ్బంది యాకయ్య పాల్గొన్నారు.



తొర్రూరు: ఫైలేరియా కిట్లు అందిస్తున్న శ్రీనివాస్

పరిసరాల పరిశుభ్రతపై కళాజాతా



పరిశుభ్రతపై వివరిస్తున్న కళాకారులు

గార్ల: వర్షాకాలంలో అంటువ్యాధులను అరికట్టేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు పరిసరాల పరిశుభ్రతపై జిల్లా కళాజాతా బృందం సభ్యులు శనివారం గార్లలో ఆటపాట ద్వారా ప్రజలకు వివరించారు. తొలుత ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ అజ్మీర బన్సీలాల్ ప్రారంభించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి గుంటల్లో నీటి నిల్వ లేకుండా చేసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ బహిర్భూమికి వెళ్లకుండా, ఇంట్లో నిర్మించుకున్న మరుగుదొడ్లనే వినియోగించుకోవాలని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్, పంచాయతీ కార్యదర్శి కుమారస్వామి, కళా బృందం టీం లీడర్ అశ్విని, కళాకారులు కొమిరె వెంకన్న, బండ వెంకన్న, జబర్దస్త్ రాజమౌళి, వంగూరి శ్రీనివాస్, మిమిక్రీ సురేష్, కవిత, భరత్, అనీల్, అంజలి, సింధు, జిన్నా, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

దంతాలపల్లి: మండలం పెద్దముప్పారం గ్రామంలో గల ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం మండలంలోని తూర్పతండా గ్రామ పంచాయతీలో వైద్యశిబిరం నిర్వహించారు. ఆయుర్వేద వైద్యుడు విజయేందర్, ఫార్మసిస్టు రమేష్, కార్యదర్శి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుకు ప్రోత్సాహం

గూడూరు: ప్రభుత్వం ఉద్యానవన, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో ఆయిల్ పాం సాగుకు అందిస్తున్న ప్రోత్సాహకాన్ని పోడు రైతులకు వర్తింపజేసిందని, మండలంలోని పోడు రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ అల్లె రాకేష్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను ఆయన వివరించారు. ఆయిల్ పాం సాగుకు మొక్కల నాటడం నుంచి మార్కెటింగ్ వరకు అన్ని రకాల ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

కురవి: సీరోలు మండలం కాంపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు శనివారం హెచ్‌ఎం కె.లక్ష్మినారాయణ తెలిపారు. ఈనెల 2వ తేదీన మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో 18 ఏళ్ల బాలుర విభాగంలో పాఠశాలకు చెందిన బి.జశ్వంత్ 100 మీటర్లలో మొదటి స్థానం, టి.అరవింద్ 400 మీటర్ల పోటీలో ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. 16 ఏళ్ల బాలుర విభాగంలో 400 మీటర్లలో ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. ఈనెల 7వ తేదీన హన్మకొండలోని జేఎన్‌ఎస్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన వివరించారు. ఎంపికైన విద్యార్థులను పీఈటీ జి.రాణి, ఉపాధ్యాయులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో పీఈటీ, ఉపాధ్యాయుడు

తప్పిపోయిన బాలుడి అప్పగింత



బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న సీఐ

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని చిట్యాల గోపయ్య నగర్‌కు చెందిన ఎస్‌కె.గౌస్ కుమారుడు అస్లాం తప్పిపోగా పోలీసులు అతడి ఆచూకీ కనుగొని తండ్రికి శనివారం అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది మార్చి 11వ తేదీన మహబూబాబాద్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. టౌన్ సీఐ వై.సతీష్ ఆధ్వర్యంలో పోలీసు కానిస్టేబుల్ కమటం సుధీర్ బాలుడి ఆచూకీ కోసం వెతుకుతుండగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పోలీసుల నుంచి సమాచారం వచ్చింది. వెంటనే అక్కడకు వెళ్లి బస్తర్ జిల్లా జగదల్ పూర్ గ్రామంలో అస్లాంను గుర్తించి మహబూబాబాద్ తీసుకువచ్చారు. టౌన్ పోలీసుస్టేషన్‌లో తండ్రి గౌస్‌కు అప్పగించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్సై వీ.దీపికరెడ్డి, పీసీ సుధీర్ పాల్గొన్నారు.

రాజుతండాలో దీపిక అంత్యక్రియలు

మృతదేహం వద్ద బంధువుల ఆందోళన

డోర్నకల్: పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న లావుడ్యా దీపిక(25) అంత్యక్రియలు శనివారం డోర్నకల్ శివారు రాజుతండాలో జరిగాయి. డోర్నకల్ శివారు రాజుతండాకు చెందిన లావుడ్యా నరేష్ గార్ల మండలం పీక్లీతండాకు చెందిన దీపిక ప్రేమించుకుని 2021 సెప్టెంబర్‌లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఓ పాప ఉండగా కొంతకాలం నుంచి అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలు, ఆడపడుచులు తనను వేధిస్తున్నారని దీపిక ఆరోపిస్తుంది. ఈనేపథ్యంలో భర్త, అతడి కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ గురువారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. పోస్టుమార్టం పూర్తి చేసిన అనంతరం మృతదేహాన్ని రాజుతండాలోని నరేష్ ఇంటికి తరలించగా దీపిక బంధువులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని దీపిక మృతికి కారణమైన నరేష్‌తోపాటు కుటుంబ సభ్యులను కఠినంగా శిక్షించాలని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొనగా సీఐ ఉపేందర్‌రావు వారికి సర్ది చెప్పి అంత్యక్రియలు పూర్తి చేయించారు. కాగా మృతురాలి భర్త, అత్త, ఆడపడుచుపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఉపేందర్‌రావు తెలిపారు.



ఆందోళన చేస్తున్న బంధువులు

కొనసాగుతున్న సమ్మె

డోర్నకల్: సమ్మెలో ఉన్న తమను విధుల్లో చేరాలంటూ కొంతమంది పంచాయతీ కార్యదర్శులు తమపై ఒత్తిడి తెస్తున్నారని జీపీ కార్మికులు ఆరోపించారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో చేపట్టిన దీక్షలు శనివారం 31వ రోజుకు చేరుకున్నాయి.

కురవి: మండల కేంద్రంలో సమ్మె శిబిరాన్ని సీఐటీయూ మండల కన్వీనర్ పోతుగంటి మల్లయ్య సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో మంజూర్ అలీ, రాంచంద్రయ్య, రమేష్, ఉపేంద్రాచారి, వెంకటయ్య, శ్రీను, సుగుణ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పరిశుభ్రత పాటించాలి

నెల్లికుదురు: స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్‌లో భాగంగా ప్రతి గ్రామంలో పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ శేశాద్రి ఆయా గ్రామాల అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఎంపీఓ పార్థసారథితో కలిసి పర్యటించి పరిసరాలను పరిశీలించారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక

కురవి: సీరోలు మండలం కొత్తూరు(సీ) ప్రాథమిక పాఠశాలకు చెందిన జాటోత్ దేవసింగ్ నాయక్ స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం గుగులోత్ కిషన్‌నాయక్ తెలిపారు. శనివారం విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

గూడూరు: మండలంలోని వెంగంపేట జీపీలో మంగళవారం జెడ్పీ సెక్టార్ నిధులతో సీసీరోడ్డు పనులను సర్పంచ్ భర్త కట్ల భవాని విష్ణుగౌడ్, నాయకుడు కుందూరు శోభన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొమ్మగాని దుర్గయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం అమలుచేయాలి

కేసముద్రం: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని వెంటనే అమలు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి గుగులోతు సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ఆసంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు తెచ్చుకున్న లంచ్ బాక్స్‌లతో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సింహాద్రి, చరణ్, వినయ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళాజాతా

డోర్నకల్: ప్రభుత్వ పథకాలను ప్రచారం చేస్తూ తెలంగాణ సాంస్కృత సారధి పోతురాజు కళా బృందం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కళాజాతా స్థానికులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ, కళాకారులు అశ్విని, వెంకన్న, సురేష్ పాల్గొన్నారు.

చెక్కు అందజేత

చిన్నగూడూరు: మండల కేంద్రానికి చెందిన లబ్ధిదారుడు మండల వెంకన్నకు రూ.60వేల విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శనివారం బీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, మండల అధ్యక్షుడు గండి ఉప్పలయ్య ఉన్నారు.

ఆర్థికసాయం

మరిపెడ రూరల్: మండలంలోని అబ్బాయిపాలెం గ్రామానికి చెందిన యువకుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, శనివారం బాధిత కుటుంబానికి గ్రామంలోని అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. నాగరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

టేకు కలప పట్టివేత



కొత్తగూడ: అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను కొత్తగూడ ఫారెస్ట్ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఎఫ్‌ఆర్‌ఓ వజ్రహత్ తెలిపిన వివరాల ప్రకారం.. పూనుగొండ్ల అటవీ ప్రాంతం నుంచి నల్లబెల్లి మండలానికి అక్రమంగా టేకు కలప తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు మండలంలోని మొండ్రాయిగూడెం, చెక్రాల తండా మధ్యలో కాపు కాసి బొలేరో వాహనం తనిఖీ చేయగా టేకు కలప ఉన్నట్లు గుర్తించామన్నారు. తరలిస్తున్న టేకు కలపతోపాటు బొలెరో వాహనాన్ని సీజ్ చేసినట్లు వివరించారు. కలప విలువ సుమారు రూ. 2లక్షలు ఉంటుందన్నారు. తనికీల్లో పాల్గొన్న సిబ్బందిని ఎఫ్‌ఆర్‌ఓ అభినందించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలో శనివారం ఓ చోట పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.38,500 స్వాధీన పరుచుకున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. అరెస్టు అయినవారిలో సురేష్, బి.సందీప్, ఉపేందర్, వినోద్, ప్రశాంత్, టి.సందీప్ ఉన్నట్లు తెలిపారు.

ఎద్దులు మృతి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని రెడ్యాల గ్రామానికి చెందిన రైతు పెద్ది చంద్రయ్యకు చెందిన రెండు ఎద్దులు జీలుగు పూత తిని శనివారం మృతిచెందాయి. దీంతో బాధిత రైతుకు రూ.1.20 లక్షలు నష్టం జరిగింది.

బైక్ అపహరించి.. మరోచోట వదిలేసి

కేసముద్రం: మండలంలోని అమీనాపురం గ్రామానికి చెందిన అంబటి రమేష్ అనే వ్యక్తి తన ఇంటి ముందు పెట్టిన బైక్‌ను, నాలుగు రోజుల క్రితం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి అపహరించాడు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అపహరణకు గురైన బైక్ నెక్కొండ మండలం తోపనపల్లి గ్రామంలో ఓ చోట శనివారం ఉదయం ప్రత్యక్షమైంది. విషయం తెలుసుకుని ఆ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీన పరుచుకున్న బైక్‌లో సెల్‌ఫోన్ ఉండగా, ఆ ఫోన్ కూడా చోరీ చేసినట్లు తెలుస్తుంది. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

దుర్భాషలాడిన ఎంపీపీ భర్త..!

నెల్లికుదురు: మండలంలోని మేచరాజుపల్లి విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ యాకూబ్‌పై ఎంపీపీ భర్త ఎర్రబెల్లి నవీన్‌రావు ఫోన్‌లో దుర్భాషలాడుతూ రైతులతో ఒల్లు పగులగొట్టిస్తా.. నకరాలు చేస్తున్నావా అని బెదిరిస్తునట్లు షోషల్ మీడియాలో శనివారం వైరలవుతోంది. ఇంతకు ముందు మేచరాజుపల్లి విద్యుత్ లైన్మెన్ కనకచారిపై దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడుతుంటే లాంగ్ లివ్ పెట్టుకున్నట్లు సమాచారం.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

గార్ల: రైల్వే ట్రాక్ దాటుతూ ప్రమాదవశాత్తు రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం రాత్రి గార్ల డోర్నకల్ రైల్వేస్టేషన్ మధ్యలో చోటుచేసుకుంది. రైల్వే ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం వివరాలు.. గార్ల–డోర్నకల్ రైల్వే స్టేషన్ మధ్యలో సుమారు 35 సంవత్సరాల వయసు గల వ్యక్తి దిగువ లైన్ దాటుతున్న క్రమంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న వందే భారత్ రైలు ఢీకొట్టడంతో మృతదేహం తునాతునకలై గుర్తుపట్టకుండా ఛిద్రమైంది. మృతుడు ఆలీవ్‌గ్రీన్ బ్లాక్ డిజైన్ రంగు ఫుల్‌షర్ట్, బ్లాక్ ప్యాంటు ధరించి ఉన్నాడు. ఖమ్మం అన్నం ఫౌండేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అన్నం శ్రీనివాస్ తన బృందంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని ఖమ్మం ఆస్పత్రి మార్చ్యూరీలో భద్రపరిచినట్లు, మృతుడి వివరాలు తెలిస్తే 94947 90619, 87126 58600 నంబర్లను సంప్రదించగలరని ఎస్సై పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు స్టేపై కాంగ్రెస్ సంబురాలు

గార్ల/గూడూరు: రాహుల్‌గాంధీ ఎంపీ అనర్హత వేటుపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంపై శనివారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నూనావత్ రమేష్‌నాయక్ , మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్, ఎంపీటీసీలు కత్తి స్వామి, మాలోత్ వెంకట్‌లాల్, సుజాత రామారావు, వెంకట్‌రెడ్డి, శంషాద్‌బేగం, రవికుమార్ , నాయకులు శ్రీపాల్‌రెడ్డి, రసూల్, వెంకన్న పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

గార్ల: ఓపెన్ ఇంటర్‌లో అడ్మిషన్లకు అభ్యర్థులు ఈనెల 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఓపెన్ ఇంటర్ కోఆర్డినేటర్ గొడుగు సోమన్న శనివారం తెలిపారు. గార్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 10వ తరగతి మధ్యలో మానేసిన, ఉద్యోగాలు చేస్తున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 94901 23708 ను సంప్రదించాలన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

జూనియర్ సివిల్ కోర్టు జడ్జి సరిత

తొర్రూరు: బడీడు పిల్లలను పనికి పంపకుండా బడిలో చేర్పించాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి సరిత అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో బాలికలకు అందిస్తున్న భోజనం, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. జడ్జి మాట్లాడుతూ విద్యార్థుల బాగుకు అందరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులు దేశ భవిష్యత్‌కు కీలకమన్నారు. బాలికా విద్యకు ప్రోత్సాహం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకౌంటెంట్ ధరావత్ విమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వంట గదిని పరిశీలిస్తున్న జడ్జి సరిత